క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పీబీ దేవం గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులలో గ్రంథాలయంపై అవగాహన పెంచడానికి పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి పి.మణికుమారి తెలిపారు. ప్రతి ఏడాది గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, ముగింపు రోజు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. చిత్రలేఖనం పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు.

విద్యార్థులకు ఆధార్ ప్రత్యేక క్యాంప్



ఆధార్ స్పెషల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

సామర్లకోట: పట్టణంలోని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ వై శివరామ కృష్ణయ్య తెలిపారు. దానిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. స్థానిక బీబీఆర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ ఆధార్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులందరికీ అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఉండాలని చెప్పారు. ఈ కేంద్రం కేవలం అపార్ కార్డుల విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు అందరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారీ అన్నదానం

సామర్లకోట: పంచారామ క్షేత్రం సమీపంలో ఉన్న మదుగులమ్మ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. ముదుగులమ్మ జాతర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ప్రతి ఏడాది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేసినట్లు ఆలయ ధర్మకర్త వల్లూరి దొరబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. అయ్యప్ప మాల ధరించిన స్వాములు, భక్తులు సహకారంతో పడిపూజ ఏర్పాటు చేశారు. వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, ఉప్పాడకు చెందిన స్వాములు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజ చేశారు.

20న జాబ్‌మేళా

పిఠాపురం: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా పిఠాపురం సూర్య ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. విరవాడ జంక్షన్‌లోని పీఎం విశ్వకర్మ సెంటర్‌లో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో మోటోకార్ప్, డైకిన్, వింగ్‌టెక్ నియోలింక్, ఇన్‌ఫిలూమ్ వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన 32 సంవత్సరాల లోపు పురుషులు, 34 సంవత్సరాల లోపు స్త్రీలు, ఐటీఐ చదివిన 27 సంవత్సరాల లోపు స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.14,000 నుంచి రూ.21,000 జీతం ఇస్తారని, శ్రీసిటీ, రేణిగుంట, మంబట్టులో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గత అభ్యర్థులు బుధవారం జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆ సంస్థ ప్రతినిధి సతీష్ సూచించారు. ఇతర వివరాలకు 70757 04852, 70759 04852 నంబర్లకు సంప్రదించాలన్నారు.

అలరించిన జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను అలరించింది. ఆలయంలో లక్ష పత్రి పూజలు చేసిన భక్తుల కోసం ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. పూజల అనంతరం జ్యోతిర్లింగార్చనకు పూజలు చేసి, వాటిలో దీపాలను లక్షపత్రి పూజలు చేసిన భక్తులు వెలిగించారు. మిగిలిన దీపాలను భక్తులు వెలిగించారు.

కొనలేం.. తినలేం..

- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- ఒకవైపు కార్తికం.. మరోవైపు మాలధారణలు
- శాకాహార భోజనాలకు డిమాండ్
- బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు



మార్కెట్‌లో కూరగాయలు కొంటున్న కొనుగోలుదారులు

సామర్లకోట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని కూరగాయల ధరలు గణనీయంగా పెరిగాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతికూల వాతావరణంతో కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. దాంతో కూరగాయల కొరత ఏర్పడటంతో డిమాండ్ ఏర్పడి, ధరలు పెరిగిపోయాయి. కార్తిక మాసం కావడంతో పాటు, శివమాల, అయ్యప్ప మాలధారణ చేసే భక్తుల సంఖ్య పెరిగింది. వీరి భోజనాల్లో కూరగాయలనే ఎక్కువగా వినియోగిస్తారు. కార్తిక మాసం అనగానే కుటుంబ సమేతంగా, బంధువులు, స్నేహితులు కలిసి తోటల్లో కార్తిక వన సమారాధనలు చేస్తుంటారు. కార్తిక మాస భక్తులు, స్వామి మాలధారణ చేసిన భక్తులు తమ భోజనాల్లో ఉల్లిపాయలను దూరంగా ఉంచుతారు. అయినా ఉల్లి ధర ఘాటుగానే ఉందని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిల్వలతోనే డిమాండ్

కూరగాయల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, అనేక మంది హోల్‌సేల్ వ్యాపారులు కూరగాయలను గోదాముల్లో నిల్వ చేయడంతో, కూరగాయల కొరత ఏర్పడిందని చెబుతున్నారు. దీనికితోడు వివిధ రకాల కూరగాయలతో పచ్చళ్లు పెట్టే పరిశ్రమలు ఏర్పడడం. కూరగాయల కొరతకు మరో కారణంగా విశ్లేషిస్తున్నారు. దీనికితోడు ఇటీవల కాలంలో హోటళ్లు, కర్రీ పాయింట్ల సంఖ్య విపరీతంగా పెరగడంతో వాటి యజమానులు భారీ స్థాయిలో సరకు నిల్వ చేయడంతో, మార్కెట్‌లో కూరగాయల కొరత ఏర్పడుతోందనే వాదనలు ఉన్నాయి. కూరగాయల ధరలపై అధికారుల నియంత్రణ లేకపోవడం వలన మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి విక్రయాలు చేస్తున్నారని అంటున్నారు. పెద్దాపురంలో రైతు బజారు పేరుకు మాత్రమే ఉన్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత వారం రోజుల్లో కూరగాయల ధరల్లో వ్యత్యాసాలు ఇలా ఉన్నాయి.

కూరగాయల దిగుమతి ఇలా..

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో పెద్దాపురంలో ప్రతి ఆదివారం పాత బస్టాండ్‌లోను, ప్రతి బుధవారం సామర్లకోట కోటమ్మ చెరువు వద్ద సంత జరుగుతుంది. ఈ సంతకు ఏలేశ్వరం, కిర్లంపూడి, ప్రతిపాడు, దివిలి, గొల్లప్రోలు, పిఠాపురం, జగ్గంపేట, తుని తదితర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకొచ్చి విక్రయాలు చేస్తుంటారు. పెద్దాపురంలో టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా రైతు బజార్ ఉన్నా, నామమాత్రంగానే నిర్వహణ జరుగుతుంది. సామర్లకోట, పెద్దాపురంలలో కూరగాయలు విక్రయం చేసే కూరగాయల వ్యాపారులు టామాటాలను కాకినాడ హోల్‌సేల్ మార్కెట్‌లో కొనుగోలు చేస్తుంటారు. మిగిలిన సరకులు ప్రతిపాడు, దివిలి, కిర్లంపూడి ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తారు.

కూరగాయలు	గత వారం (కేజీ రూ.ల్లో)	ప్రస్తుతం (కేజీ రూ.ల్లో)
వంకాయలు	40	60
బెండకాయలు	30	40
దొండకాయలు	30	40
బీరకాయలు	45	60
బంగాళదుంపలు	35	60
చేమ దుంపలు	30	50
చిక్కుడు కాయలు	80	100
ఉల్లిపాయలు	25	60
టమాటా	20	30
కేరెట్	40	60
బొబ్బర్లు	50	60
పచ్చిమిర్చి	20	40
అరటికాయ ఒకటి	(చిన్నది)5(పెద్దది)10	
ఆనపకాయ ఒకటి	(చిన్నది)15 (పెద్దది)30	
కొత్తిమీర కట్ట	(చిన్నది)10 (పెద్దది)25	

ధరల పట్టిక కచ్చితంగా ఉండాలి



ప్రతి కూరగాయల షాపు వద్ద ధరల పట్టిక కచ్చితంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. కార్తిక మాసంలో కూరగాయల వినియోగం పెరుగుతుందని, ధరలు పెంచడం సరి కాదు. అక్రమంగా కూరగాయలు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. దళారుల బెడద బాగా పెరిగిపోయింది.

– సారంపాటి లోవాచారి, చిరు వ్యాపారి, సామర్లకోట

ఇంకా పెరిగే అవకాశం ఉంది



కార్తిక మాసం వచ్చిన తరువాత ప్రతి ఏడాది కూరగాయల ధరలు పెరగడం సాధారణం. మూడు నెలల పాటు వర్షాలు కురియడంతో కూరగాయల తోటలు ముంపునకు గురయ్యాయి. దాంతో ధరలు మరింత పెరిగిపోయాయి. హోల్‌సేల్ మార్కెట్ ప్రకారం విక్రయాలు జరుగుతున్నాయి. కూరగాయల మార్కెట్ వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– కర్రి రాజు, కూరగాయల వ్యాపారి, సామర్లకోట

ఆసక్తికరంగా కబడ్డీ క్రీడాకారుల ఎంపిక



ఎంపిక కోసం తలపడుతున్న పురుష క్రీడాకారులు



తలపడుతున్న మహిళా కబడ్డీ క్రీడాకారిణులు

సామర్లకోట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహిళా, పురుషుల కబడ్డీ జట్ల ఎంపిక ఆదివారం సాయంత్రం ఆసక్తికరంగా సాగింది. రాజమహేంద్రవరం, కాకినాడ, కిర్లంపూడి, జగ్గంపేట, సామర్లకోట నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. మొత్తం 80 మంది పురుషులు, 50 మంది మహిళలు పాల్గొన్నారు. వీరిలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను రాష్ట్ర కబడ్డీ విశ్రాంత కోచ్ పోతుల సాయి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్లు డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం సంతనూతలపాడులో 71వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయని కబడ్డీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీను తెలిపారు. కౌన్సిలర్ బలసు వాసు, సంఘ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల కిరణ్, కోశాధికారి తాళ్లూరి వైకుంఠం, మహిళా కబడ్డీ కోచ్ శ్వేత, ఆయా మండలాల నుంచి పీడీలు, పీఈటీలు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు,

ఘనంగా గౌరీశంకరుల మహోత్సవాలు

- ఆకట్టుకున్న దేవతామూర్తుల వేషధారణలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



గౌరీదేవి ఉత్సవాల్లో ఆకట్టుకున్న శక్తివేషాలు



కొత్తపల్లిలో గౌరీదేవి, నందీశ్వరుని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలో పలు గ్రామల్లో ఆదివారం గౌరీ శంకరుల మహోత్సవాలు వైభవంగా జరిగాయి. స్థానిక బీటు వీధిలో గత నెల రోజులుగా గౌరీశంకరుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని కొమరగిరి, రవీంద్రపురం, మూలపేట తదితర గ్రామాల్లో గౌరీదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు, శక్తివేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కొత్తపల్లిలో గురువారం జరిగే స్వామివారి నిమజ్జనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వరి దుబ్బే గౌరీదేవి

మండల పరిధిలోని గ్రామాల్లో వరి దుబ్బును గౌరీదేవిగా భావించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఏటా వరిదుబ్బుతో గౌరీదేవి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజలు సుఖసంతోషాలు, పాడి పంటలు, సౌభాగ్యాలతో ఆనందంగా ఉంటారని భక్తుల నమ్మకం. ఈ ఆచారం పూర్వకాలం నుంచి కొనసాగుతోంది. కాగా శివ పార్వతుల ప్రతిరూపంగా కొలిచే నందీశ్వరుని కార్తిక పౌర్ణమికి మూడు రోజుల ముందు ఊరేగించి నిమజ్జనం చేయించడం ద్వారా సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీనిలో భాగంగా ఊరేగింపులో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

యూటీఎఫ్ నేతల వెల్లడి



అవార్డు గ్రహీత సైపుల్లాను సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

సామర్లకోట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సత్యాగ్రహ దీక్షలు ఒక్కటే మార్గమని యూటీఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తి అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో ఆదివారం యూటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో వారు ముఖ్య, గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల పదోన్నతులు, పీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాగా సంఘ పట్టణ శాఖ అధ్యక్షుడిగా ఆర్.గణేష్, గౌరవాధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసు, కోశాధికారిగా సయ్యద్ సైపుల్లా, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఆర్.శైలజ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రాజా, కార్యదర్శులుగా పి.కాశీవిశ్వనాథం, టీఎస్ పద్మావతి, ఎం.నాగమణి, జె.ప్రవీణ, కె.జగదీష్, గురుప్రకాష్, డి.వీరన్న, జిల్లా కౌన్సిలర్లుగా ఎం నాగేశ్వరరావు, జి.బేబీరాణి, కేఎస్ శేఖరం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నూకరాజు వ్యవహరించారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సయ్యద్ సైపుల్లాను సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పాల్గొన్నారు. మున్సిపాలిటీలో ఉర్దూ ఉపాధ్యాయుడికి అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. హెచ్‌ఎం టి.శ్యామ్‌సుందర్, విశ్రాంత హెచ్‌ఎంలు వై.ప్రభాకర్, బి.మోహనరావు, సీనియర్ నాయకుడు పి.గిరిధర్ గోపాలరావు పాల్గొన్నారు. అనంతరం విస్తరణ శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులు కార్తిక వన సమారాదన నిర్వహించారు.

జోరుగా కార్తిక వన సమారాధనలు



సామర్లకోట ఐఎంఎఫ్ఎల్ డిపోలో పూజలు చేస్తున్న కార్మికులు

సామర్లకోట: కార్తిక వన సమారాధనలు ఆదివారం జోరుగా సాగాయి. కార్తిక మాసంలో కుటుంబ సమేతంగా ఒకచోట భోజనాలు చేయడం అనవాయితీ. ఇందులో భాగంగా రావి, ఉసిరి చెట్లకు పూజలు చేశారు. భోజనాలకు సిద్ధం చేసిన వంటలను నైవేద్యంగా పెట్టి, సహపంక్తి భోజనాలు చేశారు. స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపో ఎగుమతి, దిగుమతి కార్మికులు డిపోలో ఆదివారం కార్తిక సమారాధన భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులు, సిబ్బంది, కార్మికులు, లిక్కర్ ఏజెంట్లు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక తంబులోడి గొయ్యి వద్ద పైన్ని శ్రీనివాసు తోటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక సమారాధన భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. పీబీ దేవం, పి. వేమవరం, ఉండూరు గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు ఘనంగా జరిగాయి.

తీరం.. పర్యాటక హారం



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ తీరం

కొత్తపల్లి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ఉప్పాడ సాగరతీరానికి పర్యాటకులు పోటెత్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తీర ప్రాంతానికి చేరుకుని వనభోజనాలు నిర్వహించారు. సెలవు రోజు కావడంతో యువత, విద్యార్థులు స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలసి బీచ్‌కు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. కడలి కెరటాల్లో కేరింతలు కొడుతూ ఆటలాడటంతో సాగర తీరం క్రీడామైదానంగా మారిపోయింది. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిన్నా పెద్దా తేడాలేకుండా వివిధ రకాల ఆటపాటలతో పర్యాటకులు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగర తీరంలో సేదతీరారు. తీరంలో ఎక్కడా ఎటువంటి వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కన్నుల పండువగా దీపోత్సవం



శివలింగం ఆకృతిలో వెలిగించిన కార్తిక దీపాలు



కార్తిక దీపాల వెలుగులో కుక్కుటేశ్వరస్వామి



కార్తిక దీపాల వెలుగులో పాదగయ క్షేత్రం

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో ఆదివారం రాత్రి కార్తిక దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అధికారులు అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా శివలింగాకృతిలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. కార్తిక దీపాల వెలుగులో కుక్కుటేశ్వరస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు.

షష్ఠి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న కమిటీ సభ్యులు

పెద్దాపురం: మండలంలోని చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం పందిరి రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.46 గంటలకు స్వామివారి షష్ఠి ఉత్సవాలకు ముహూర్తపు రాటను నిలబెట్టి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు కోడిగుడ్డు త్రిమూర్తులు, తాడాల ఏసుబాబు, కర్నీడి సురేష్ మాట్లాడుతూ, ఐదు రోజుల పాటు నిర్వహించే షష్ఠి ఉత్సవాలను గత ఏడాదికంటే ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఉత్సవానికి భక్తులు భారీగా తరలిరావాలన్నారు. వచ్చే ఏడో తేదీన షష్ఠి రోజున ఏలేరు నదిలో భక్తులు స్నానమాచరించి, స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఐదు రోజుల పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రపాటి వీరబాబు, బత్తుల సీతారామయ్య, మల్లిపూడి చిన్న తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో...



తాటిపర్తిలో పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు ఆదివారం రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకర శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల్లో పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం నాలుగో రోజు నిర్వహించిన వారోత్సవాల సదస్సులో కవి సమ్మేళనం జరిగింది. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షత వహించారు. అభ్యుదయ కవి చల్లా విశ్వనాథం, జోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి కనబర్చాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాహిత్యం అవసరం ఎంతో ఉందన్నారు. తెలుగు భాష గొప్పతనం, కంద పద్యాలు ఆలపించి, పలువురు కవుల సందేశాలు వివరించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం స్వామి వారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, అల్లికి రాజ్‌గోపాల్‌శర్మ, వేమూరి సోమేశ్వరశర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద రాత్రి ఆకాశదీపాన్ని వెలిగించారు.